క్లుప్తంగా

పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ

కాకుమాను: విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించే విధంగా హెచ్ఎంలు కృషి చేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలకు క్రీడా సామగ్రి, శానిటరీ మెటీరియల్స్‌ను ఆయన అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా పాఠశాలలకు క్రీడా సామగ్రి అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో శానిటేషన్ మెటీరియల్స్‌ను కూడా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



పెదకాకాని: ప్రభుత్వ భూములలో నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి అన్నారు. ఈ మేరకు తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నేతాజీ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ, శ్రీ లక్ష్మీ దుర్గ శివ కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీలలో పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. తహసీల్దారు పి.రత్నంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు కె.సత్యనారాయణ, బి.బాబురావు, బి.సాంబయ్య, వి.శివయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గుంటూరు వెళ్లి పింఛను నగదు అందజేత



కాకుమాను: కాకుమానుకు చెందిన బొనిగల మోహన రావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ మిక్కిలి హెమీమా గుంటూరు వెళ్లి మోహనరావుకు వృద్ధాప్య పింఛన్ నగదును అందజేసింది. దీంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఆక్రమణల తొలగింపు



గుంటూరు రూరల్: రహదారులను ఆక్రమించి, ట్రాఫిక్‌కు కారణమైతే సహించేది లేదని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఎన్‌హెచ్-16 సమీపంలో బుడంపాడు వద్ద ప్రధాన రహదారి ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను నల్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది తొలగించారు. సీఐ మాట్లాడుతూ బుడంపాడు ప్రధాన రహదారిని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయటం వల్ల నిత్యం ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రయాణికులు నుంచి ఎన్నో ఫిర్యాదులు అందాయని చెప్పారు. మరోసారి రోడ్డును ఆక్రమించినట్లయితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

శివదుర్గ కాలనీలో పట్టాలు పంపిణీ

పెదకాకాని: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే ఆశయంతో వీఆర్వో సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని సంస్థ ప్రతినిధి వేళంగిణి అన్నారు. గుడిసెలపై కప్పుకునేందుకు సోమవారం టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. నంబూరు అడ్డరోడ్డుకు సమీపంలో యానాదులు నివశిస్తున్న శివదుర్గ కాలనీకి జేఎంజే స్వచ్ఛంధ సంస్థ సహాయ సహకారాలు అందిస్తోంది. గ్రామ పున ర్నిమాణ సంస్థ ఆర్థిక సహకారంతో జేఎంజే వారి ఆధ్వర్యంలో సోమవారం 56 కుటుంబాలకు పట్టలు పంపిణీ చేశారు. జేఎంజే ప్రోగ్రాం మేనేజర్ సిస్టర్ సుశీల, సిస్టర్ సునేరియా, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.ఐజక్, డి.స్రవంతి, పి.అనిల్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ టి.ప్రశాంతి పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’తో వెలుగులోకి క్రీడా ప్రతిభ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుబ్బారావు, అధికారులు

గుంటూరు రూరల్: గ్రామీణ స్థాయిలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు అన్నారు. నగరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శోభారాణి అధ్యక్షతన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమావేశం సోమవారం నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను రాష్ట్రస్థాయి తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. ఇది గ్రామీణ విద్యార్థులు, యువతకు గొప్ప అవకాశమన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ క్రికెట్, వాలిబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో రూ.35 వేలు, జిల్లా స్థాయిలో రూ.60 వేలు నగదు మొదటి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి విజేతలకు మొదటి బహుమతిగా రూ.5 లక్షలు, ద్వితీయం రూ.3 లక్షలు, తృతీయ జట్టుకు రూ.2 లక్షల అందిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

చేబ్రోలు పంచాయతీ ఉప సర్పంచ్‌గా చౌడయ్య



ఉప సర్పంచ్ గా ఎన్నికైన గువ్వాడ పెద చౌడయ్య

చేబ్రోలు: మేజర్ పంచాయతీ చేబ్రోలు ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారు గువ్వాడ చౌడయ్య సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉప సర్పంచ్‌గా ఉన్న సీహెచ్ నాగేశ్వరరావు రాజీనామా చేయటంతో ఉపసర్పంచ్ పదవికి ఖాళీ ఏర్పడింది. ఉప సర్పంచ్ ఎన్నికను ఈవో పీఆర్డీ జి.శ్రీనివాసరావు నిర్వహించారు. మొత్తం 20 మంది పంచాయతీ పాలకవర్గ సభ్యులకు గాను 12మంది సభ్యులు 13వ వార్డు మెంబరు గువ్వాడ చౌడయ్యను బలపరచటంతో ఉప సర్పంచ్ పదవికి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. చేబ్రోలు పంచాయతీకి మొట్టమొదటి సారిగా రజక సామాజిక వర్గానికి చెందిన చౌడయ్యకు ఉప సర్పంచ్ పదవికి అవకాశం కల్పించిన పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు పలువురు అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, మాజీ ఉప సర్పంచ్ షేక్ షరీఫ్, వార్డు మెంబర్లు పెనుమోలు రాజేష్, దొప్పలపూడి చంద్, జీడీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, కారుమూరి రాజేంద్ర, భవనం పుల్లారెడ్డి, హనుమంతరావు తదితరులు అభినందించారు.

ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

గుంటూరు రూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కళాశాలలో ఉపాధి కల్పన లక్ష్యంగా నైపుణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వివిధ రకాల ఇన్నోవేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దీంతో జాతీయ స్థాయిలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, లక్ష్య సాధన దిశగా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.హరిబాబు పాల్గొన్నారు.

‘కళ్లం’ కళాశాలలో బీటెక్ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రమ శిక్షణతో చదువుకుని ప్రతి విద్యార్థి లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కళ్లం మోహనరెడ్డి సూచించారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ నైపుణ్యాలు కలిగిన విద్యను అభ్యసించి, సమాజానికి ఉపయోగకరమైన విధంగా తయారవ్వాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ఉపాధ్యక్షుడు పి.వెంకట రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, బీఎస్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ జీ శ్రీనివాసులు, డాక్టర్ పీఎల్ మాధవరావు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి

మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ పెరుమాళ్లు

ప్రత్తిపాడు: పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని మలినేని ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని కళాశాలలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పెరుమాళ్లు మాట్లాడుతూ పిల్లల చదువు పూర్తయ్యే వరకు ఏడాదికి కనీసం రెండు సార్లు అయినా తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి, పిల్లవాడి విద్యా ప్రగతికి సంబంధించిన విషయాలు అకడమిక్ ఫ్యాకల్టీతో చర్చించి తెలుసుకోవాలన్నారు. సైకాలజిస్ట్, కెరీర్ కౌన్సిలర్ ఎస్. సుధీర్‌కుమార్ మాట్లాడూతూ బాహ్య ప్రపంచంలో రాణించేందుకు చేయవలసిన పనులను వివరించారు. విద్యార్థి దశలోనే చక్కటి లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్. డి.శ్రీనివాసకుమార్, అకడమిక్ డైరెక్టర్ జె.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

‘స్పందన’ అర్జీలకు పరిష్కారం



స్పందన కార్యక్రమంలో కమిషనర్ నయీం అహ్మద్, తహసీల్దారు శ్రీకాంత్

పొన్నూరు: పొన్నూరు పట్టణ, మండల పరిధిలోని ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, తహసీల్దార్ కేదార్‌నాథ్ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని వీసీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 1బీ అడంగల్, ఇంటి స్థలం, రైస్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, డ్రెయినేజీ సమస్య తదితర సమస్యలపై అర్జీలను స్వీకరించారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం నుంచి మండలానికి సంబంధించిన అర్జీలను వీడియో కాన్ఫరెన్సు ద్వారా తెలుసుకున్నారు. మండల అధికారులు పాల్గొన్నారు.

గొడ్డలితో అన్నను గాయపరచిన తమ్ముడు

పెదకాకాని: ఆస్తుల వివాదంలో అన్నపై తమ్ముడు గొడ్డలితో దాడి చేసిన సంఘటన సోమవారం నంబూరులో చోటు చేసుకుంది. మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన భీమిరెడ్డి వీరారెడ్డి, భీమిరెడ్డి వేణుగోపాలరెడ్డి అన్నదమ్ములు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా ఆస్తి వివాదాలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలోనూ, పోలీసుస్టేషన్‌లోనూ గతంలో మాట్లాడుకున్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం అన్న వీరారెడ్డి తన ఇంటి వద్ద ఉండగా వేణుగోపాల్ రెడ్డి గొడ్డలి తీసుకుని అతనిపై దాడి చేశాడు. దీంతో బాధితుడి భుజం వీపుపై గొడ్డలి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెస్ట్ పేపర్ ప్రజంటర్‌గా ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు

గుంటూరు రూరల్: నైపుణ్యతలతో కూడిన విద్యా విధానం, ప్రతి ఒక్కరికి లక్ష్యసాధన దిశగా ప్రోత్సాహం అందించటం తమ కళాశాల లక్ష్యమని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ నాదెండ్ల రామారావుకు ఏపీటీఐసీఓఎస్-2023 జాతీయ స్థాయిలో నిర్వహించిన సదస్సులో బెస్ట్ పేపర్ ప్రజంటర్‌గా మొదటి బహుమతి లభించిందన్నారు. ఫార్మా స్యూటికల్ ఎడ్యుకేషన్ కేటగిరిలో ఫార్మా స్యూటికల్ ఎంటర్ పెన్యూర్‌షిప్ క్రియేటింగ్ ఆపర్చునిటీస్ ఫర్ ఫార్మసీ ఎడ్యుకేషన్ అనే అంశంపై ఆయన ప్రదర్శించిన పోస్టర్ ప్రజంటేషన్‌కు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించటం సంతోషకరమన్నారు. జాతీయ స్థాయిలో తమ కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ప్రిన్సిపల్ ప్రొపెసర్ ఎన్ రామారావును అభినందించారు. ఈ బహుమతిని ఉత్తరప్రదేశ్‌లోని పీఎస్ఐటీ విశ్వవిద్యాలయంలో జరిగిన ఏపీటీఐసీఓఎస్ జాతీయ స్థాయి సదస్సులో ఏపీటీఐ సెక్రటరీ ప్రొఫెసర్ రామన్‌డాంగ్, అధ్యక్షుడు ప్రొఫెసర్ మిలింద్‌జౌన్‌రావ్ ఉమేకర్, చైర్మన్ ప్రొఫెసర్ దీపేంద్రసింగ్ చేతులమీదుగా అందుకున్నట్లు వెల్లడించారు. రెండు రోజుల వ్యవధిలో ఆయన జాతీయ స్థాయిలో రెండు అవార్డులను పొందారన్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్ జేఎన్‌టీయూతో ఆర్‌వీఆర్‌జేసీ ఎంఓయూ



ఎమ్‌వోయూ పత్రాలను అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలను స్టార్ట్ అప్ హబ్‌గా నెలకొల్పటంలో హైదరాబాదు జేఎన్‌టీయూ తోడ్పాటు అందించేందుకు ముందుకు రావటం శుభ పరిణామమని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ అన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో స్టార్ట్ అప్ టెక్నాలజీ పార్క్ ఫౌండేషన్ అభివృద్ధికి జేఎన్‌టీయూ ముందుకొచ్చిందన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇటీవల మాజీ ఉప రాష్ట్రపతి ప్రారంభించిన ఇంక్యూబేటర్ సెంటర్‌ల ద్వారా నూతన స్టార్ట్ అప్‌లలో విజయవంతమైన అంకుర పరిశ్రమలను పరిచయం చేయవచ్చన్నారు. మూల ధనాన్ని సమకూర్చేందుకు పరిశ్రమల యాజమాన్యాలను ముందుకు తీసురావటం జరుగుతుందని జేటీబీఐ సీఈవో కార్తిక్ తాడికొండ తెలిపారు. ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, టీబీఐ సెంటర్ కన్వీనర్ డాక్టర్ ఎమ్‌వీపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన దావల రాజు (55) బేల్దారు పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలో పనులకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై గొట్టిపాడుకు వస్తున్నాడు. అదే సమయములో 16వ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోని పార్వతిదేవి గుడి సమీపంలో బోయపాలెం నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజు గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో అతనిని ఆస్పత్రికి తరలించారు. రాజు కుమారుడు దావల శివ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్ర బాబు తెలిపారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

గుంటూరు రూరల్: అధిక ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్ ఆరోపించారు. సోమవారం నగరంలోని బ్రాడీపేట నందున్న తహసీల్దారు కార్యాలయంలో పెట్రోలు, గ్యాస్, డీజిల్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని ధర్నా చేశారు. పార్టీ నగర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు బి.ముత్యాలరావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చే ముందు రూ.400లు ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,150 పెంచి, ఇప్పుడు రూ. 200లు తగ్గించినట్లుగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ చిష్టి, నగర కమిటీ సభ్యులు బి.సత్య నారాయణ నాయకులు పాల్గొన్నారు.

ఆకు కూరల్లో పోషక విలువలు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం



అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ వెంకటరత్నం

ప్రత్తిపాడు: ఆకుకూరలు, కూరగాయల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా సోమవారం ప్రత్తిపాడు మార్కెట్ ఏరియా, గనికపూడి అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్లు యం. వెంకటరత్నం, వి. అరుణ బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కమల జ్యోతి, హెల్పర్ బుల్లెమ్మాయ్ పాల్గొన్నారు.

‘విజ్ఞాన్’ యంగ్ జనరేషన్ టీం సేవలు అభినందనీయం

వేజండ్ల, వడ్లమూడి గ్రామాల్లో సేవా కార్యక్రమాలు



వేజండ్ల జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సామగ్రి అందజేసిన సభ్యులు

చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీ యంగ్ జనరేషన్ టీం సభ్యుల సేవలు అభినందనీయమని వడ్లమూడి గ్రామ సర్పంచ్ మోరంపూడి అనితారాణి అన్నారు. వడ్లమూడి, వేజండ్ల గ్రామాల్లో సోమవారం యంగ్ జనరేషన్ సభ్యులు వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టారు. యంగ్ జనరేషన్ సారథి సాథిక్, అతని బృంద సభ్యులు వడ్లమూడి గ్రామ పంచాయతీ పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌కు బెడ్, ఫ్యాన్లు, 10 కుర్చీలు ఇతర సామగ్రిని సర్పంచ్ అనితారాణి చేతుల మీదుగా అందజేశారు. వేజండ్ల జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం విజయశ్రీ, స్పెషల్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు హ్యాండ్ స్టిక్స్, స్టేషనరీ కిట్స్, ఇతర సామగ్రిని అందజేశారు. ఉర్వా స్కూల్‌లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. యంగ్ జనరేషన్ బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏటుకూరులో ఇరువర్గాల ఘర్షణ

గుంటూరు రూరల్: పుట్టిన రోజు వేడుకల్లో వివాదం చెలరేగి ఇరువర్గాల ఘర్షణ పడ్డారు. ఈ ఘటనపై నల్లపాడు పోలీసులు సోమవారం కేసు నమోదుచేశారు. ఏటుకూరు గ్రామానికి చెందిన విప్పె మల్లికార్జునరావు స్థానికంగా డెయిరీ ఫామ్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద నిశ్శంకర రావు నరేంద్ర అతని స్నేహితులు కలిసి మల్లికార్జునరావుపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అదే గ్రామానికి చెంది న తన్నీరు ప్రేమ్‌కుమార్ అదే దేవాలయం వద్ద మల్లికార్జునరావు, అతని స్నేహితుడు తనపై దా డిచేశారని ఫిర్యాదు చేశాడు. స్థానికంగా విచారించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పుట్టినరోజున జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసినట్లు పోలీసులవిచారణలో తేలింది.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ నరసరావుపేట కళాశాల ప్రిన్సిపల్

చేబ్రోలు: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని జేఎన్‌టీయూ నరసరావుపేట కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. చేబ్రోలులోని ఆర్‌వీఐటీ కళాశాలలో సోమవారం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ రావెళ్ల వెంకట కృష్ణయ్య అధ్యక్షత వహించారు. డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నికల్ స్కిల్స్, వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ బి.నగేష్, కళాశాల వైస్ చైర్మన్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి, డైరక్టర్ మాలెపాటి శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు ఆశ్రమం, గాంధీనగర్‌లోని షిరిడి సాయి ఆశ్రమాల్లో సోమవారం ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్ర వర్ధంతిని పురస్కరించుకొని ఆశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ఉమేష్‌చంద్ర తల్లిదండ్రులు చదలవాడ వేణుగోపాలరావు, నయనతార, ఉమామహేశ్వరరావు, ఆశ్రమాల నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, భారతి, మురళి, అనూష, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితా సర్వేపై సమావేశం

పొన్నూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే, క్లెయిమ్‌ల పరిష్కారానికి మంగళవారం పొన్నూరు తహసీల్దారు కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దారు కేదారనాథ్ శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సమావేశం జరగుతుందని తెలిపారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



నూతన పింఛనుదారులతో కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి రాష్ట్రాభివృద్ధికి కృషిచేయటం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణా దేవి అన్నారు. సోమ వారం డివిజన్ పరిధిలోని చౌడవరం, దాసరిపాలెం సచివాలయాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. డివిజన్ పరిధిలో వెయ్యికి పైగా పింఛన్లు ఇస్తున్నట్లు ఆయన ఆమె తెలిపారు. నూతనంగా 39 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. మరో 37 మంది లబ్ధిదారులకు వెరిఫికేషన్ పూర్తయిందని, త్వరలో వారికీ పింఛన్లు అందజేస్తామన్నారు. అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.